



గోదారికి ఎర్రనీరొచ్చింది



గోదావరికి ఎర్ర నీరు వచ్చేసింది... చాలా కాలంగా నీరు లేక వెలవెలబోయిన గోదావరి ప్రస్తుతం నీటితో కళకళలాడుతోంది. ఎర్ర నీరు అందాన్ని తెచ్చిపెట్టింది. ఆలమూరు మండలం జొన్నాడ వద్ద పలువురు మహిళలు గోదావరిలో పసుపు, కుంకుమ వేసి పూజలు చేస్తున్నారు. ఈ ఎర్ర నీరే కాలువలకూ వెళ్తుంది. ఈ నీటిని పంట భూములకు పెడితే సారవంతంగా మారి నాట్లు త్వరితగతిన పచ్చపడతాయని రైతుల నమ్మకం.

- ఆలమూరు

శాకంబరిగా చింతలూరు నూకాంబిక

108 కిలోల కూరగాయలతో అలంకరణ

ఆలమూరు, జూలై 10: ఉభయ గోదావరి జిల్లాల్లో పేర్గాంచిన చింతలూరు నూకాంబికా అమ్మవారు బుధవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ శుద్ధ చవితితో కూడిన పంచమి పర్వదినాన అమ్మవారిని భక్తులు 108 కిలోల వివిధ రకాల కూరగాయలతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు మహిళలు కుంకుమార్చన చేశారు.



పేరూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

సీబీఎస్ఈ పాఠశాలలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

డీఈవో కమలకుమారి... పేరూరులో పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి

అమలాపురం రూరల్, జూలై 10: కోనసీమ జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్.మహేష్‌కుమార్ సీబీఎస్ఈ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి తెలిపారు. త్వరలోనే ఆయన జిల్లాలోని సీబీఎస్ఈ పాఠశాలలను సందర్శిస్తారని తెలిపారు. జిల్లాలోని పేరూరు, గొల్లవిల్లి, అల్లవరం, కేశనపల్లి, తాపేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ఉందని, వీటితో పాటు మరో ఏడు ప్రైవేటు పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానంలోనే పరీక్షలు జరుగుతాయన్నారు. డీఈవో కమలకుమారి బుధవారం పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యనందించేలా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి నైపుణ్యాలను గుర్తించారు. నోటు పుస్తకాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించడమే కాకుండా వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు జిల్లాలోని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలకు టీచ్ టూల్ ఓరియంటేషన్ శిక్షణ ఇస్తామన్నారు. అమలాపురం డివిజన్‌కు సంబంధించి పేరూరులోను, డివిజన్ కేంద్రమైన రామచంద్రపురంలోను శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయులు పాఠం చెప్పేటప్పుడు విద్యార్థులను ఏ విధంగా పరిశీలన చేయాలో వివరిస్తారన్నారు. డీఈవో వెంట సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ మధుసూదనరావు, సమగ్ర శిక్షాసీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో రాంబాబు, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్, నాగిరెడ్డి శివప్రసాద్ వున్నారు.



విచారణ నిర్వహిస్తున్న స్త్రీ నిధి ఏజీఎం ప్రసన్నలక్ష్మి, డీపీఎం శామ్యూల్

డ్వాక్రా యానిమేటర్ అవినీతిపై ఉన్నతాధికారుల విచారణ

13 డ్వాక్రా గ్రూపుల్లో రూ.3.73 లక్షల అవినీతి జరిగినట్టు నిర్ధారణ

ఆలమూరు, జూలై 10: డ్వాక్రా సంఘాల నిర్వహణకు నియమించిన యానిమేటర్ల అవినీతి రోజురోజుకూ పెరిగిపోతోంది. మండల కేంద్రమైన ఆలమూరులో పనిచేస్తున్న డ్వాక్రా యానిమేటర్ శిరోమణిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై బుధవారం ఆలమూరులోని ఏపీఎం కార్యాలయంలో స్త్రీ నిధి జిల్లా ఏజీఎం ప్రసన్నలక్ష్మి, డీపీఎం ఎం.శామ్యూల్ అధ్వర్యంలో డ్వాక్రా సంఘాల సమక్షంలో విచారణ నిర్వహించారు. శిరోమణి పరిధిలో 59 డ్వాక్రా సంఘాలు ఉండగా 13 సంఘాల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టారు. లావాదేవీలపై సమగ్ర విచారణ చేయగా రూ.3.73 లక్షలు అవినీతి జరిగినట్టు నిర్ధారించారు. ఈ మొత్తాన్ని తక్షణం చెల్లించాలని విచారణ అధికారులు యానిమేటర్‌ను ఆదేశించగా ఆమె అంగీకరించినట్టు డ్వాక్రా సంఘాల నిర్వాహకులు తెలిపారు. ఆలమూరు మండలంలోని అనేక గ్రామాల్లో ఇదే తరహాలో పలు యానిమేటర్లు అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇదే తరహాలో విచారణ చేసి న్యాయం చేయాలని డ్వాక్రా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

రూ.8.72 లక్షలు విలువైన డీజిల్ సీజ్

ఐ.పోలవరం/అమలాపురం టౌన్, జూలై 10: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి డీజిల్ రవాణా అక్రమంగా అవుతోందన్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు అప్రమత్తమై బుధవారం దాడులు నిర్వహించారు. ఐ.పోలవరం మండలం కొమరగిరి సమీపంలో జాతీయ రహదారిపై బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా 2,800 లీటర్ల డీజిల్ గుర్తించారు. యానాంలోని ఈలీయ ఫ్యూయల్స్ బంక్ యాజమాని ఆలమూరి సత్తిరాజు ఆదేశంతో డ్రైవర్ మట్టా వెంకటేశ్వరరావు యానాం నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా డీజిల్‌ను అమలాపురం రూరల్ మండలం తాండవపల్లిలోని సురేష్‌రాజు రొయ్యల చెరువుల వద్ద మోటారు ఇంజన్లకు ఉపయోగించేందుకు రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. రూ.8.72 లక్షలు విలువైన 2,800 లీటర్ల డీజిల్‌తో పాటు వాహనాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు సీజ్ చేశారు. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు సిఫార్సు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఎస్ఐ జగన్నాథరెడ్డి, ఏవో భార్గవమహేష్, కిశోర్, శివ, లక్ష్మీప్రసన్న, వీఆర్వో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలో మూడు జిల్లాల్లో పెట్రో ఉత్పత్తుల అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



అక్రమంగా డీజిల్ తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

> గత వైసీపీ ప్రభుత్వంలో 'నాడు-నేడు' అన్నారు. పాఠశాలల రూపురేఖలు మార్చేస్తామన్నారు. అంతా పారదర్శకమేనన్నారు. ఇవన్నీ మాటలకే పరిమితం. నాడు-నేడు పథకం కింద అన్ని పనులూ చేసేది కాంట్రాక్టు సంస్థలే. ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా ఒక ఫ్యాను బిగించుకోవాలంటే సంబంధిత హెచ్‌ఎం సంబంధం లేకుండా పోయింది. ఒకరు తర్వాత ఒకరు కాంట్రాక్టర్లు వచ్చి వారు పొందిన పనులు చేసుకువెళ్లిపోయారు. మొదటి దశలో కంపెనీ ఫ్యాన్లు సరఫరా చేసినప్పటికీ రెండో విడత నాసిరకం బిగించి వెళ్లిపోయారు. ఫ్యాన్లు ఒకరు బిగిస్తే టైల్స్ ఒక సంస్థ సరఫరా చేస్తే.. సిమెంటు మరొకరు సరఫరా చేశారు.సంబంధిత బిల్లులను మాత్రం పై స్థాయిలోనే తీసేసుకుని రశీదులు మాత్రం పాఠశాలలకు పంపించేవారు. ప్యూరిఫైడ్ వాటర్ ట్యాంకులను మరో సంస్థకు అప్పగించగా పలు పాఠశాలలకు నేటికీ చేరుకోలేదు.



పేరూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు

కాంట్రాక్టర్ల మాయాజాలం

- నాసిరకం ఫ్యాన్లు సరఫరా
- వాటర్ ప్యూరిఫైడ్ ట్యాంకులు లేవు
- టాయిలెట్లకు తలుపులు లేవు..
- వదిలి వెళ్లిపోయిన కాంట్రాక్టర్లు
- పాఠశాలల్లో 'నాడు-నేడు' పనుల తీరిది
- మంత్రి లోకేశ్ సమీక్షతో కదలిక వచ్చేనా..!

అమలాపురం రూరల్, జూలై 10: జిల్లాలోని పాఠశాలల్లో 'నాడు-నేడు' పనులన్నీ కాంట్రాక్టు సంస్థలే చేశాయి. ప్రభుత్వ పాఠశాలల భవన నిర్మాణాలకని ఇసుకను సైతం సరఫరా చేస్తున్నట్టు గొప్పలు చెప్పడమే తప్ప వందల కొద్దీ లారీల ఇసుక దారిమళ్లిపోయినా అడిగే వారు లేరు. పట్టించుకునే వారూ లేకుండా పోయారు. నాటి ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలోనే తొలిసారిగా పి.గన్నవరంలో 'నాడు-నేడు' పథకం కింద మంజూరై పనులు పూర్తి చేసుకున్న పాఠశాలను ప్రారంభించారు. అక్కడ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలను గుర్తించి అప్పట్లోనే పలువురు ఇంజనీరింగ్ అధికారులను సస్పెండ్ చేశారంటే ఏ స్థాయిలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చు. అదే పాఠశాలను ముస్తాబు చేసేందుకు జిల్లా నలుమూలలనుంచి ఆర్ట్ ఉపాధ్యాయులను రప్పించి బొమ్మలు వేయించారు. వాటికయ్యే రంగుల ఖర్చులను కూడా ఆ ఉపాధ్యాయులే భరించారు. నాలుగేళ్లు గడిచిపోయినా వారు ఖర్చు చేసిన లక్షలాది రూపాయల సొమ్ములు, వారు పడ్డ శ్రమకు ఫలితం ఇంతవరకు అందలేదు. తమకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల కోసం ఆర్ట్ ఉపాధ్యాయులు అప్పట్లో స్పందనలో ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినా వారి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

అంతా కాంట్రాక్టర్ల మయం....

నాడు-నేడు పథకంలో భవనాల నిర్మాణం మినహా మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులన్నీ కేంద్రీకృత కాంట్రాక్టు సంస్థలే చేపట్టాయి. నిర్మాణాలు మాత్రం ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ఆధ్వర్యంలో వైసీపీ కాంట్రాక్టర్లు, తల్లిదండ్రుల కమిటీల ఆధ్వర్యంలో జరిగాయి. ఇక నాడు-నేడు పథకం కింద మంజూరైన పాఠశాలలకు అవసరమైన విద్యుత్ పరికరాలు, టైల్స్, పెయింట్లు, ఫ్యాన్లు, బోర్డులు... ఇలా ఒక్కటేమిటి అన్నీ కేంద్రీకృత కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలోనే సరఫరా జరగడం, వాటిని పాఠశాలల్లో బిగించడం జరిగిపోయాయి. కేవలం హెచ్‌ఎంలు, కమిటీ ప్రతినిధులు వారు పంపించిన రశీదులు తీసుకోవడం మినహా చేసేది ఏమీ లేదు. టైల్స్ వారు సరఫరా చేస్తే ఇక్కడ పాఠశాలల్లో కాంట్రాక్టు పొందినవారు బిగించేవారు. కాంట్రాక్టు ప్రతినిధులే వచ్చి రంగులు వేసి వెళ్లిపోయేవారు. ఇంత జరుగుతున్నా కింది స్థాయిలో విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు, కమిటీలు ఏమీ చేయలేని నిస్సహాయత. ప్రశ్నిస్తే ఏమవుతుందోనన్న భయం. పాఠశాల్లోని తరగతి గదులను బట్టి రంగులు వేయడానికి రూ.5లక్షల నుంచి రూ.8 లక్షల వరకు కేటాయించారు. ఇక ప్యూరిఫైడ్ వాటర్ ట్యాంకుల ఏర్పాటుకు విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.4.5లక్షల నుంచి రూ.6లక్షల వరకు కేటాయించారు. ఇందుపల్లి వంటి ఉన్నత పాఠశాలలకు ప్యూరిఫైడ్ వాటర్ ట్యాంకులు ఇప్పటికీ చేరలేదు. ఇలా మౌలిక సదుపాయాల కల్పన పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైందని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద ఈ నెల 6న సర్పంచ్ పెనుమాల సునీత అధ్యక్షతన జరిగిన గ్రామసభలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనుల అవకతవకలపై విచారణ జరిపించాలని తీర్మానం చేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అసలు కాంట్రాక్టులు పొందింది ఎవరో తెలియదు. వాటిని ఎవరు సరఫరా చేశారో తెలియదు. బిల్లులు మాత్రం పై స్థాయిలోనే పొందడం వెనుక పెద్ద మతలబే దాగి ఉందని ఉపాధ్యాయులు సైతం చెప్తున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాల్సిన అవసరం ఉందంటున్నారు.

నాడు అట్టహాసంగా శంకుస్థాపనలు...

నాడు-నేడు రెండో విడత పనులకు వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. 2023 మార్చి ప్రథమార్థంలో ప్రభుత్వం నుంచి కొంత మేర నిధులు విడుదలయ్యాయి. రెండో విడత విడుదలైన నిధులతో జిల్లాలో ఏ పాఠశాలకు వెళ్లినా అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు, పునాదుల దశ దాటని పాఠశాలల భవన నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. నాడు-నేడు పనులపై ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు తప్ప నిధులు విడుదల చేయకపోవడంతో అసంపూర్తిగానే పనులు మిగిలిపోయాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేస్తారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ఉపాధ్యాయుల కొరత మాట దేవుడెరుగు తరగతి గదులు కూడా లేని పరిస్థితి ఏర్పడింది. ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.1.30 కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో రూ.23లక్షలు విడుదలయ్యాయి. ఆరు అదనపు తరగతి గదులతో పాటు తొమ్మిది విభాగాల్లో ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. అదనపు తరగతి గదుల నిర్మాణం పునాదుల దశలోనే నిలిచిపోతే బాలికల టాయిలెట్లు, వంట షెడ్ల నిర్మాణాల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ పాఠశాలలో టాయిలెట్లను వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు తలుపులు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టరును కోరినప్పటికీ బిల్లు బకాయిలు వచ్చే వరకు తలుపులు బిగించేది లేదంటూ వెళ్లిపోయాడు. దాంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అర్ధంతరంగా నిలిచిపోయిన పనులు...

నాడు-నేడు పథకం కింద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 451 పాఠశాలలను ఎంపికచేసి రూ.59.62 కోట్లు నిధులు విడుదల చేశారు. అప్పట్లో ఆ పనులు దాదాపుగా పూర్తి అయ్యాయి. రెండో విడత నాడు-నేడు పనుల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 763 పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.257 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టాల్సి ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వం రూ.119 కోట్లు మాత్రమే విడుదల చేయడంతో కాంట్రాక్టు పొందినవారు తూతూమంత్రంగా పనులు చేశారు. మరికొన్నిచోట్ల అయితే అర్థంతంగా పనులు వదిలేసి వెళ్లిపోయారు. మానవవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్ అసంపూర్తి భవనాల నిర్మాణంపై దృష్టి సారిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ అధికారులతో లోకేశ్ ఇప్పటికే సమీక్ష నిర్వహించడంతోపెండింగు పనులకు త్వరలోనే ఆదేశాలు విడుదలయ్యే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.





ఇందుపల్లిలో పునాదుల దశలోనే అదనపు తరగతి గదులు, బండారులంకలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం (ఇన్‌సెట్లో)

ఖరీఫ్ పంట ముంపు బారిన పడకుండా మ్యాపింగ్

- కలెక్టర్ మహేష్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంట కోత దశలో ముంపు బారిన పడకుండా మ్యాపింగ్ చేసి ముంపునీరు దిగువకు పారేలా పూడికతీత పనులు చేపట్టాలని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తద్వారా ముంపు ప్రభావిత ప్రాంతాలను గుర్తించి పూడికతీతలు, షట్టర్ రిపేర్లు పటిష్టంగా చేపట్టవచ్చని లైన్ డిపార్టుమెంట్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో జలవనరులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల పనితీరుపై సమీక్షించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు, క్రిమిసంహారక మందులు సకాలంలో అందిస్తూ రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందించి ఖరీఫ్‌లో రైతులు అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించాలన్నారు. ఎక్కడా ఎరువుల కొరత రాకుండా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ సస్యరక్షణ పద్ధతులను వివరించాలన్నారు. పంట కాలపరిమితి తక్కువగా ఉండే వరి వంగడాలను ఎంపిక చేసుకుని తుఫాన్ల బెడద నుంచి పంటలను కాపాడుకోవాలన్నారు. వెదజల్లు విధానంపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించడం ద్వారా ఎకరాకు రూ.6వేలు వరకు పెట్టుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. మార్కెట్‌లో డిమాండు కలిగిన వరి వంగడాలను ఎంపిక చేసుకుని రైతులు గిట్టుబాటు ధర పొందాలన్నారు. మార్క్‌ఫెడ్ అనుసంధానంతో గోదాముల ద్వారా ఎక్కడా ఏ విధమైన కొరత లేకుండా రాయితీపై ఎరువులు అందించాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ఎక్కడా నకిలీలకు అవకాశం లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూసార పరీక్షలు నిర్వహిస్తూ సూక్ష్మ పోషకాల సరఫరా పునరుద్ధరణకు కృషి చేయాలన్నారు. రాష్ట్రీయ కృషి వికాస యోజన, మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టీకల్చర్, కొబ్బరి అభివృద్ధి బోర్డు పథకాల ద్వారా ఉద్యానవన పంటల సాగును మరింత పెంచాలని సూచించారు. అభ్యుదయ రైతుల ద్వారా అంతర పంటల సాగు చేపట్టాలన్నారు. ఎంఐడీహెచ్ ద్వారా గోదాములు నిర్మించి కొబ్బరి నిల్వచేస్తూ గిట్టుబాటు ధర పొందేలా చూడాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఒకే జిల్లా-ఒకే ఉత్పత్తి కింద కొబ్బరి పంటకు జిల్లా ఎంపికైందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బీవీ రమణ, జలవనరుల శాఖ డీఈ శ్రీనివాసరావు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి పంట కాల్వలు, డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టి సాగునీరు, ముంపునీరు సవ్యంగా పారేలా రైతులకు భరోసాగా నిలవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ పథకం అమలు తీరుపై బుధవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సామాజిక తనిఖీ ప్రక్రియల ద్వారా పారదర్శకంగా ఉపాధి హామీ పనులు జరగాలన్నారు. ప్రతి కుటుంబానికీ వంద రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు సగటు వేతనం రూ.300 అందేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటి మూడేళ్ల పాటు నిర్వహణ చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యానికి తోడ్పాటు అందించాలన్నారు. 60 శాతం కూలి వేతనాలు, 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్‌తో గ్రామాల్లో సీసీ రోడ్లు, బరియల్ గ్రౌండ్లు, ప్రహరీలు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. సమావేశంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీపీవో డి.రాంబాబు, హెచ్ఆర్ త్రినాథ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రైతులు, శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

13 మంది పొగాకు రైతులకు టీఐఐ అవార్డులు

సత్కరించిన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

దేవరపల్లిలో టుబాకో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా పురస్కారోత్సవం

దేవరపల్లి, జూలై 10: 'ప్రపంచంలోనే నాణ్యమైన పొగాకు ఉత్పత్తులకు మనదేశం పెట్టిందిపేరు. అందులోనూ అత్యధిక స్థాయిలో పొగాకు పండించేది కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని' రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం కరుటూరి ఫంక్షన్ హాలులో టుబాకో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (టీఐఐ) 24వ అవార్డు కార్యక్రమంలో ఆమె పాల్గొని పొగాకు శాస్త్రవేత్తలు, రైతులను అవార్డులతో సత్కరించారు. రాష్ట్రస్థాయిలో మొత్తం 16 మంది అవార్డులకు ఎంపిక కాగా, ఇందులో 13 మంది రైతులకు, ముగ్గురు శాస్త్రవేత్తలకు పురస్కారాలను అందించారు. పొగాకు సాగులో ఆధునిక సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించడం, పొగాకు పంట పరిశోధన, అభివృద్ధిలో నిమగ్నమైన అభ్యుదయ రైతుల వ్యవసాయ క్షేత్రాలను ఎంపిక చేసి వారికి ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన అవార్డు ప్రదానోత్సవ సభలో పురందేశ్వరి మాట్లాడుతూ పొగాకు సాగులో రైతులతో పాటు శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని, వారికి అవార్డులు అందించడం హర్షణీయమని చెప్పారు. ఈ ఏడాది అకాల వర్షాలకు పొగాకు పంట దెబ్బతిందన్నారు. రైతుల కోరిక మేరకు పరిమితికి మించి జరిగిన పొగాకు అమ్మకాలపై పెనాల్టీని రద్దు చేయాలని వాణిజ్యశాఖ మంత్రి పియూష్‌గోయల్‌తో మాట్లాడామని త్వరలోనే నిర్ణయం వస్తుందన్నారు. పొగాకు ఉత్పత్తిలో కూలీల ఖర్చు పెరిగిపోయిందని, దానికి ఆకురెల్పు యంత్రాలు, ఆకు కుట్టే యంత్రాలను తయారు చేయాలని, కలప కూడా దొరికే పరిస్థితి లేనందున బేరన్‌లో పొగాకు క్యూరింగ్ చేయడానికి గ్యాస్ ద్వారా సోలార్ ఎనర్జీని అభివృద్ధి చేయడానికి సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని, పొగాకుకు, పామాయిల్ పంటకు సంబంధించి రైతుల తరపున తాము సమస్యల పరిష్కారానికి ముందుంటామన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ భూసారాన్ని పరిరక్షించుకోవడానికి రైతులు విపరీతంగా రసాయనిక ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పొగాకు ఉత్పత్తి చేయాలన్నారు. పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ పొగాకు పంట ద్వారా రూ.12 వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం లభిస్తోందని, ఈ పొగాకు పంటపై 4 వేల కోట్ల మంది ఆధారపడుతున్నారన్నారు. పొగాకు రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, పొగాకు పంట పరిమితి మేరకే పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, పొగాకు బోర్డు వైస్ ఛైర్మన్ వాసుబాబు, టుబాకో బోర్డు కార్యదర్శి డి.వేణుగోపాల్, సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్, పొగాకు రైతు సంఘం నాయకులు, అవార్డు గ్రహీతలు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ పొగాకు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



అవార్డుతో సత్కరిస్తున్న ప్రముఖులు

పొగాకు రైతు పురస్కార గ్రహీతలు వీరే :

సయ్యద్‌బాజీ(కొయ్యలగూడెం బోర్డు, అచ్చయ్యపాలెం), గురుబ్రహ్మం (కనిగిరి బోర్డు, భూతవారిపల్లి), టి.వెంకటశేషమ్మ (ఒంగోలు బోర్డు, చేకూరుపాడు) ఎ.శ్రీనివాస్‌రెడ్డి (వినుకొండ బోర్డు, యోగిరెడ్డిపాలెం) జి.సంజీవ్‌రెడ్డి (వినుకొండ బోర్డు, రెడ్డినగర్), కె.వెంకటసత్యనారాయణ (జంగారెడ్డిగూడెం-1 బోర్డు, పెద్దాపురం), ఎస్.ఎం.రెడ్డి (కందుకూరు-2 బోర్డు ఓలేటివారిపాలెం), కె.అంజిరెడ్డి (వెల్లంపల్లి బోర్డు, జి.నిడమర్రు), సుజాత (కొత్తదొడ్డి బోర్డు, రాయ్‌చూర్), సత్తి జగదీశ్వర్‌రెడ్డి (దేవరపల్లి బోర్డు, కృష్ణంపాలెం) జి.వి.రమణారెడ్డి, (కందుకూర్-1 బోర్డు, సింగరబొట్లపాలెం)

అవార్డులు అందుకున్న శాస్త్రవేత్తలు

డాక్టర్ వై.సుబ్బయ్య, డాక్టర్ పూర్ణబిందు, డాక్టర్ సీ.నంద

లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డులు

గద్దే బాబురాజేంద్రప్రసాద్ (జంగారెడ్డిగూడెం-2, రెడ్డి గణపవరం), జి.నరసపనాయుడు (డీసీ.పల్లి, గుండెమడకల గ్రామం)



ఎంపీ హరీష్‌మాధుర్‌ను కలిసిన కోనసీమ జేఏసీ ప్రతినిధులు

ఐదేళ్ల లోపు కోనసీమ రైల్వే ప్రాజెక్టు పూర్తి

ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, జూలై 10: లోక్‌సభ దివంగత స్పీకర్, తన తండ్రి జీఎంసీ బాలయోగి ఆశయ సాధనలో భాగంగా కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ పూర్తి చేయడమే తన లక్ష్యమని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. బుధవారం ఆయనను క్యాంపు కార్యాలయంలో కోనసీమ జేఏసీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. కోనసీమ రైల్వేలైన్ గురించి చర్చించగా.. ఎంపీ స్పందిస్తూ ఐదేళ్లలోపు కోనసీమ రైల్వే ప్రాజెక్టు పూర్తిచేసే దిశగా ముందుకు సాగుతున్నట్టు వివరించారు. భూసేకరణలో జాప్యం కారణంగానే పనులు ముందుకు సాగట్లేదని జేఏసీ సభ్యులు ఎంపీ దృష్టికితీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, సహ కన్వీనర్లు యిళ్ల భక్తవత్సలం, కరాటం ప్రవీణ్, మంత్రిప్రగడ వేణుగోపాల్, సభ్యులు డాక్టర్ మధుర నరసింహమూర్తి, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, అన్యం రాంబాబు, రంకిరెడ్డి కాశీ, సీలి సంసోను, నంద్యాల నాయుడు, పమ్మి నాగేశ్వరరావు, టి.సుందరరామయ్య పాల్గొన్నారు.



అభినందనలు తెలియజేస్తున్న ఏపీ ఎన్జీవో నాయకులు

గోదావరి డెల్టా సిస్టం సీఈగా

బాధ్యతల స్వీకరణ

ధవళేశ్వరం, జూలై 10: గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీర్‌గా క్వాలిటీ చీఫ్ ఇంజనీర్ పుల్లారావు బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు కార్యాలయంలో కలిసి అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.జయకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాజబాబు, బి.లక్ష్మణుడు, పీఎస్ శేషకుమార్, కుమారస్వామి, వాసుదేవి తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చాలని కలెక్టర్‌కు ఎమ్మెల్సీ లేఖ

రంగంపేట, జూలై 10: ఏడీబీ రోడ్డు గుంతలు తక్షణమే పూడ్చాలని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకర్లకు వివరాలు వెల్లడించారు. రాజానగరం నుంచి సామర్లకోట వరకు నిర్మిస్తున్న ఏడీబీ రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే అర్థాంతరంగా ఆగిపోవడంతో దారుణంగా పాడైపోయిందని, రాజానగరం సెంటర్ నుంచి రామస్వామిపేట వరకు గల ఏడీబీ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా ఉందని, ఈ రోడ్డు మీద రోజూ వేలాది వాహనాలు కాకినాడకు నిత్యం ప్రయాణం చేస్తుంటాయని ఈ గుంతల రోడ్డు కారణంగా ఈ మధ్య కాలంలో వందలాది మంది ప్రమాదాలకు గురయ్యారని లేఖలో పేర్కొన్నట్లు చెప్పారు. ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంత్‌ను కలిసి ఈ రోడ్డు గుంతలు తక్షణమే పూడ్చాలని కోరినట్టు లేఖలో పేర్కొనగా వారు సానుకూలంగా స్పందించారని ఐవీ తెలిపారు.

అత్యాచార ఘటనపై ఏఎస్పీ విచారణ

ఎటపాక, జూలై 10: మండలంలోని ఓ గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచార ఘటనలో బుధవారం ఏఎస్పీ రాహుల్ మీనా క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఘటనపై బాధిత తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యాచార ఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం చుట్టుపక్కల వారిని ప్రశ్నించారు. నిందితుడిని కఠినంగా శిక్షించేలా చేస్తామని చెప్పారు. అయితే వైద్య పరీక్షలు నిమిత్తం బాధిత చిన్నారిని చింతూరుకు తరలించారు. ఏఎస్పీ వెంట సీఐ డి.రామారావు, ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరి, ఎస్ఐ పార్థసారథి, వీఆర్వో కన్నమ్మ ఉన్నారు.

డయేరియాతో చికిత్స పొందుతూ మృతి

సీతానగరం, జూలై 10: డయేరియా సోకిన వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీతానగరం గ్రామానికి చెందిన బేదంపూడి జగన్నాథం(61) ఈ నెల 2న డయేరియాతో సీతానగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. దీంతో వాంతులు, విరేచనాలు తగ్గాయి. అనంతరం ఈ నెల 5న రాజమహేంద్రవరంలోని కిడ్నీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి గంగా హాస్పటల్‌లో చేర్చగా అక్కడ డయాలసిస్ చేశారు. అక్కడ నుంచి ఈ నెల 9న కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించాడు. జగన్నాథంకు డయాలసిస్ చేస్తున్నారని కాకినాడ నుంచి రెండు రోజులలో వచ్చే రిపోర్టును పరిశీలించి మరణానికి గల కారణాలను నిర్ధారిస్తామని పీహెచ్‌సీ వైద్యులు డా. చైతన్య తెలిపారు.

800 కిలోల గంజాయి పట్టివేత

చింతూరు, జులై 10 : మోతుగూడెం పోలీసులు రూ. 40 లక్షల విలువైన 800 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం విలేకరుల సమావేశంలో చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా వివరాలు వెల్లడించారు. రెండు వేర్వేరు ఘటనలలో మొత్తం 800 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అమిత్‌గిరి, శివదయాల్, అలోక్ గోతం, రంజిత్‌మాఝై, దుర్గేశ్‌గోస్వామి ఒక ముఠాగా ఏర్పడ్డారు. అనంతరం ఈ ఐదుగురు ఒడిసా రాష్ట్రం, మల్కానగిరి జిల్లా అల్లూరికోటకు చెందిన సంజీవ్ అలియాస్ గెన్ను వద్ద 550 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం గంజాయిని అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం పోలీసు స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతానికి తరలించారు. అక్కడ నుంచి మధ్యప్రదేశ్‌కు తరలించే క్రమంలో ఐచర్ వ్యాన్‌లో లోడ్ చేశారు. సమాచారం అందుకున్న మోతుగూడెం పోలీసులు కాపు కాచి ఐచర్ వ్యాన్‌తో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా మధ్యప్రదేశ్‌కు చెందిన రంజిత్‌మాఝై, దుర్గేశ్‌గోస్వామిలతో పాటు ఒడిసాకు చెందిన సంజీవ్ పరారీలో ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, కుంటకు చెందిన మజ్జి వెంకట్ సమంత్, తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకకు చెందిన సతీష్‌రెడ్డి, వరంగల్ జిల్లా జనగాంకు చెందిన యరవ వివేక్ డొంకరాయి పోలీసు స్టేషను పరిధిలోని మంగంపాడు నుంచి హైదరాబాద్‌కు కారులో 250 కిలోల గంజాయి తరలించే ప్రయత్నం చేశారు. మోతుగూడెం పోలీసులు కాపు కాచి కారుతో పాటు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ ఘటనలో సతీష్‌రెడ్డి, యరవ వివేక్ పరారీలో ఉన్నట్లు ఏఎస్పీ తెలిపారు. గంజాయి స్మగ్లింగ్ విషయంలో పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. తెలిసో తెలియకో వాహనాలను అద్దెకు ఇవ్వడం కూడా నేరమేనని ఏఎస్పీ చెప్పారు. వాహనాలను అద్దెకు ఇచ్చే సమయంలో సంబంధిత వాహన యజమానులు విధిగా పూర్తి వివరాలు తీసుకొని అద్దెకు ఇవ్వాలని ఏఎస్పీ సూచించారు. చింతూరు డివిజన్ పరిధిలో పోలీసు చెక్‌పోస్టులు పకడ్బందీగా ఏర్పాటు చేశారని, ఇకపై గంజాయి తరలింపు అనేది ఈ దిశగా అసాధ్యమని ఏఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో చింతూరు సీఐ గజేంద్రకుమార్, మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాహుల్‌మీనా

బైక్ అదుపుతప్పి కానిస్టేబుల్ మృతి



మృతిచెందిన చాంద్‌బాషా



మోతుగూడెం, జూలై10: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో తులసిపాక మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లో బైక్ అదుపుతప్పి లోయలో పడడంతో మంగళవారం అర్ధరాత్రి రాజమహేంద్రవరానికి ఎస్ఈబీ కానిస్టేబుల్ మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం.. చింతూరు ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ చాంద్‌బాషా (54) చింతూరు నుంచి రాజమండ్రి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. తులసిపాక సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద బైక్ అదుపు తప్పి లోయలో బోల్తా పడింది. ఈ ఘటనలో చాంద్ బాషా అక్కడికక్కడే మృతి చెందినట్లు మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో కడియపులంక వాసి మృతి



కడియం, జూలై 10: మహబూబ్‌నగర్ జిల్లా నవపేట మండలం ఇప్పటూర్‌లో విద్యుత్‌షాక్‌కు గురైన సంఘటనలో కడియం మండలం కడియపులంకకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తిరుమాళ్ళకు చెందిన గోళ్ల నూకార్జున(36)కు ఓ వ్యాను ఉంది. ఓనర్ కం డ్రైవర్‌గా ఉన్నాడు. జీవనం కోసం కొన్నేళ్ల క్రితం కడియపులంక వచ్చి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మామిడి మొక్కలను వేసుకుని నూకార్జున మహబూబ్‌నగర్ జిల్లా వెళ్లాడు. ఇప్పటూర్‌లో బుధవారం వ్యాన్‌లో వెళుతుండగా విద్యుత్ తీగలు వ్యాన్‌కు తగలడంతో వ్యాన్‌కు విద్యుత్ సరఫరా అయ్యి మృతి చెందాడు. నూకార్జునకు భార్య సాయిదుర్గ, 9 ఏళ్ల కుమార్తె అశ్విని, 3 ఏళ్ల కుమారుడు రాజేష్ ఉన్నారు.

నేటి నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 10: అల్లూరి సీతారామరాజు నాటక పరిషత్ ఆధ్వర్యంలో 40వ వార్షికోత్సవం పురస్కరించుకుని 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని సంస్థ ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు తెలిపారు. కాకినాడ సినిమారోడ్‌లోని సూర్యకళామందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు నాటిక పోటీలు జరుగుతాయన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు తెలుగు వీర లేవరా-దీక్షబూని సాగరా పేరుతో సినీ సంగీత స్వరాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభ సభ జరుగుతుందన్నారు. సభలో ముఖ్య అతిథిగా కాకినాడ నగర శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), విశిష్ట అతిథిగా ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. రాత్రి 7 గంటలకు మలి సంధ్య, అనంతరం ఆ సరసాల నాటిక ప్రదర్శనలు జరుగుతాయన్నారు. 13వ తేదీన ఆంధ్రశ్రీ అవార్డును ప్రముఖ పారిశ్రామికవేత్త సలాది వీర వెంకట సత్యనారాయణమూర్తికి, 14న అల్లూరి సీతారామరాజు విశిష్ట సాంస్కృతిక సేవా పురస్కారాన్ని శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకులు గుంటూరి తణుకులు(శ్యామ్)కు అందజేస్తామని వివరించారు. అనంతరం నాటిక పోటీల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. పరిషత్ ఉపాధ్యక్షులు బాపిరాజు, కిర్ల పుల్లారావు పాల్గొన్నారు.

ఇంకా లభ్యం కాని గల్లంతైన వృద్ధుడి ఆచూకీ



ఆర్అర్‌బీ చెరువు వద్ద పరిస్థితి సమీక్షిస్తున్న ఆర్డీవో, సీఐ

గొల్లప్రోలు రూరల్, జూలై 10: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం గ్రామానికి చెందిన వృద్ధుడు తటవర్తి వేమన్నదొర ఆచూకీ బుధవారం రాత్రి వరకూ లభ్యం కాలేదు. వేమన్నదొర పశువులు మేపేందుకు 7వ తేదీ సాయంత్రం మల్లవరంలోని ఆర్అర్‌బీ చెరువు వద్దకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చెరువులో పడి గల్లంతై ఉండవచ్చునని పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై పోలీసులు పరిశీలన జరిపారు. బుధవారం పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది, నలుగురు గజ ఈతగాళ్లు చెరువులోకి దిగి గాలించినప్పటికి ఫలితం లేకపోయింది. గాలింపు చర్యలను తహసీల్దారు ఉదయభాస్కర్, పోలీసు అధికారులు పర్యవేక్షించారు. చెరువు మొత్తంలో నీరు లేదని, మూడు మీటర్ల వెడల్పు గల కాలువలో మాత్రమే నీరు ఉన్నట్లు గుర్తించారు. హెలికాప్టర్ ద్వారా గాలిస్తే ఫలితం ఉండవచ్చునని గ్రామ ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. ఈ నేపథ్యంలో కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు గాలింపు చర్యలు కోసం హెలికాప్టర్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాన్ని పంపాలని జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్ ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాసారు. కలెక్టర్ సూచనల మేరకు బుధవారం సాయంత్రం ఎస్‌డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగినా వృద్ధుడి ఆచూకీ కనుక్కోలేకపోయినట్టు స్థానికులు తెలిపారు. గురువారం గాలింపు చర్యలు కొనసాగనున్నాయి.

'రాజకీయ కక్షకు బలైన శ్రీనుకు విముక్తి కల్పించాలి'

ముమ్మిడివరం, జూలై 10: రాజకీయ కక్షకు బలైన జనిపల్లి శ్రీనివాసరావు (కోడికత్తి శ్రీను)కు కేసుల నుంచి విముక్తి కల్పించాలని విదసం (విశాఖ జిల్లాల దళిత సంఘాల ఐక్య వేదిక) విజ్ఞప్తి చేసింది. బుధవారం జనపల్లి శ్రీనివాసరావు, అతని సోదరుడు సుబ్బరాజు, విదసం నాయకులతో కలిసి విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు మురముళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)కు ఈ మేరకు విన్నవించారు. ఎన్ఐఏ చట్టం 2008 సెక్షన్ 7-బి ప్రకారం కేసు దర్యాప్తు ప్రాసిక్యూషన్ నుంచి ఎన్ఐఏ వైదొలగాలని, రాష్ట్ర ప్రభుత్వం కేసును సమీక్షించి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవీఎం పగులగొట్టి పోలింగ్ ఏజెంటును, పోలీసు అధికారిని కొట్టి రిమాండ్‌లో ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జైలుకు వెళ్లి పలకరించిన జగన్మోహనరెడ్డి కోడి కత్తి కేసులో కనీసం కోర్టుకు రాకుండా కేసును సాగదీసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు స్పందించి... కోడికత్తి శ్రీనును త్వరలోనే ప్రభుత్వ పెద్దల వద్దకు తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. విదసం నేతలు జాజి ఓంకార్, మూర మహేష్, బూల భాస్కరరావు, బల్ల కుమార్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన శ్రీను, విదసం సభ్యులు

సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా

బాధ్యతల స్వీకరణ



మోతుగూడెం, జూలై10: సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ద్రోణం రాజు చిన కామేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేశారు. ప్రమోషన్ మీద సీలేరు కాంప్లెక్స్ లోయర్ సీలేరులో సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యమోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం చీఫ్ ఇంజనీర్ కార్యాలయ సిబ్బంది పి.ఆనంద్‌బాబు, వేమగిరి కిరణ్ రామారావు, కామేష్, ఏపీ జెన్కో లోయర్ సీలేరు ఉద్యోగస్తులు ఇంజనీర్స్ కాంట్రాక్ట్ కార్మికులు అభినందనలు తెలిపారు.

దంగేరులో మహా ప్రస్థానం సిద్ధం



కె.గంగవరం, జూలై 10: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం దంగేరు గ్రామంలో మహాప్రస్థానం సిద్ధమైంది. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీంతో గ్రామానికి చెందిన రావిపాటి వంశీయుల వితరణ రూ.50లక్షలతో మహాప్రస్థానాన్ని సిద్ధం చేశారు. కైలాస రథాన్ని ఏర్పాటు చేశారు. ఇకపై అంత్యక్రియలు నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ రావి పాటి వెంకటగణేష్‌చౌదరి, సొసైటీ మాజీ అధ్యక్షుడు రావిపాటి రవీంద్రనాథ్‌చౌదరి, రావిపాటి రవి, పోలిశెట్టి సతీష్, ఉప్పులూరి సత్యనారాయణ, రావిపాటి వెంకట సుబ్బరాయ చౌదరి, దంగేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నియామక ఉత్తర్వులు

రంపచోడవరం, జూలై 10: అంగన్వాడీ కేంద్రాలలో ఇటీవల ఉద్యోగాలు పొందిన వారికి రంపచోడవరం ఐసీడీఎస్ కేంద్రంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి బుధవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టులను అధికారులు ఇటీవల భర్తీ చేశారు. రంపచోడవరం ఐసీడీఎస్ పరిధిలోని ఆరుగురికి నియామక ఉత్తర్వులను ఎమ్మెల్యే అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలుగా తల్లీబిడ్డల సంరక్షణ ఎంతో పవిత్రంగా నిర్వహించాలని కోరారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు ఉదయభాస్కర్, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

మన్యంలో ఆర్గానిక్ పత్తి పండించే ప్రాజెక్టు



పీవోను కలిసిన నెదర్లాండ్స్ ప్రతినిధులు

రంపచోడవరం, జూలై10: మన్యంలో 4 వేల ఎకరాల్లో ఆర్గానిక్ పత్తిని పండించే ప్రాజెక్టును నెదర్లాండ్స్‌కు చెందిన రెడీస్ స్వచ్ఛంద సంస్థ చేపడుతోందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో నెదర్లాండ్స్ ప్రతినిధులతో జరిగిన సమావేశ వివరాలను ప్రాజెక్టు అధికారి వెల్లడించారు. గ్రామీణ వికాస కేంద్రం ద్వారా 4 వేల ఎకరాలలో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని ఆయనకు బృందం వివరించింది. స్వీట్ ఆరెంజ్ మొక్కలు, పత్తి జిన్నింగ్ కోసం మిషనరీ ఏర్పాటు, పసుపు, జీడిపప్పు మార్కెటింగ్ కోసం కూడా నెదర్లాండ్ సహాయంతో ప్రణాళికలను సిద్ధం చేయడానికి చర్చించామని అన్నారు.

మంచినీళ్ల కోసం ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్థులు

కూనవరం, జూలై10: మండలంలోని మర్రిగూడెంలో గ్రామస్థులు మంచి నీళ్ల కోసం ధర్నా నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఊరులో ఉన్న బావి నీటిని కేవలం తన సొంత ఇంటికే ప్రభుత్వ మోటారు ద్వారా సరఫరా చేసుకుంటున్నాడని గ్రామస్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో ఎస్ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి వెళ్లి వైసీపీ నాయకుల దగ్గర ఉన్న మోటారును తిరిగి గ్రామ పంచాయతీకి అప్పగించారు. దీంతో గ్రామస్థులు ధర్నా విరమించారు.

ఇసుక ఉచిత అమ్మకాలు ప్రారంభం

కొత్తపేటలో 10: కొత్తపేటలోని స్టాక్ పాయింట్ వద్ద నిల్వ ఉంచిన ఇసుక అమ్మకాలను ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, తహసీల్దారు జి.ఎలీషా బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. మెయింటెనెన్స్ ఖర్చుల కింద టన్నుకు రూ.245 వసూలు చేస్తామని, రెవెన్యూ, మైన్స్ శాఖల పర్యవేక్షణలో నిల్వలు పూర్తయ్యే వరకు పంపిణీ చేస్తామని ఎలీషా చెప్పారు.

సమగ్ర శిక్షా రికార్డుల పరిశీలన

అంతర్వేది, జూలై 10: సఖినేటిపల్లి ఎంఈవో కార్యాలయంలో సమగ్ర శిక్షణా రికార్డులను ఫైనాన్స్, అక్కౌంట్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, జిల్లా సీనియర్ అక్కౌంటెంట్ వి.వరప్రసాద్ బుధవారం పరిశీలించారు. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, షూ, స్టూడెంట్ కిట్లను పరిశీలించారు. ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, మండల అక్కౌంటెంట్లు రాజబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన

ద్రాక్షారామ, జూలై 10: సమ్మెకాలం, రెండునెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ బుధవారం మండల విద్యావనరుల కేంద్రం వద్ద భోజన విరామసమయంతో సమగ్రశిక్షాలో పనిచేస్తోన్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, వి.నాగేశ్వరికి అందజేశారు. సీఆర్పీలు, సీవోలు, పార్ట్‌టైమ్ ఇనస్ట్రక్టర్లుపాల్గొన్నారు.

మామిడికుదురు: సర్వశిక్షా అభియాన్‌లో పనిచేస్తోన్న ఉద్యోగులకు వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండు చేస్తూ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో వారు నిరసన తెలిపారు. మే, జూన్ నెలల జీతాలు విడుదలచేయాలని, హెచ్ఆర్ పాలసీ, ఎంటీఎస్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్షా సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పీఆర్ఎంపీలు, మెస్సెంజర్‌లు పాల్గొన్నారు.

రాజోలు: రాజోలులో భోజన విరామ సమయంలో సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు బుధవారం మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. మే, జూన్ నెలల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగ భద్రత, ఈపీఎఫ్, ఈఎస్ఐను వెంటనే అమలు చేయాలని జి.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, శ్రీలక్ష్మి, బాలశ్రీలక్ష్మి, దుర్గాంబ, పి.శ్రీనివాస్, చలం, పార్వతీశం, మల్లేష్, వీరబాబు పాల్గొన్నారు.

సాగర్ కవాచ్

అంతర్వేది, జూలై 10: అంతర్వేది నదీ సముద్ర తీర ప్రాంతంలో రాజోలు సీఐ గోవిందరాజు ఆధ్వర్యంలో బుధవారం సాగర్ కవాచ్ నిర్వహించారు. తీర ప్రాంతంలో సముద్ర నదీ మార్గం నుంచి గుర్తుతెలియని వ్యక్తులు గ్రామాల్లోకి చొరబడితే వారిని ఎలా గుర్తించాలనే దానిపై పోలీసులు సాగర్ కవాచ్ నిర్వహించారు. కొందరు పోలీసులు గుర్తుతెలియని వ్యక్తుల్లా రావడంతో పోలీసులు సాగర్ కవాచ్ నిర్వహించి వారిని గుర్తించారు. కార్యక్రమంలో సఖినేటిపల్లి ఎస్ఐ ఎస్.రాము, మెరైన్ పోలీసులు పాల్గొన్నారు.

వెసులుబాటు కల్పించాలి

అమలాపురం టౌన్, జూలై 10: గతంలో మాదిరిగా రాత్రి 11 గంటల వరకు పట్టణంలో వ్యాపారాలు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలని కోరుతూ ది అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులు పట్టణ సీఐ కె.క్రిస్టఫర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, ముఖ్య సలహాదారుడు నల్లా పవన్‌కుమార్, చింతలపూడి సత్తిబాబు, వర్రే బాబి, గోకర కొండ గంగన్నస్వామినాయుడు, నల్లా దుర్గ, వీరతాతాజీ, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● డిమాండ్స్ డే నేపథ్యంలో డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న, డ్వాక్రా, మెప్మా సిబ్బంది ఆందోళన

కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం ధర్నా

అమలాపురం టౌన్, జూలై10: కార్మికుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట డిమాండ్స్ డేను పురస్కరించుకుని ధర్నా నిర్వహించారు. గత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేయడంతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కార్మిక, కర్షక ఉద్యమ పోరాటాల ఫలితంగానే కేంద్రంలో బీజేపీ హవా తగ్గిందని వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులు, స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని,కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు, పార్టుటైమ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలతో హోరెత్తించారు.డిప్యూటీ తహసీల్దారు అడపా సుబ్రహ్మణ్యానికి వినతిపత్రం అందజేశారు. తొలుత నిర్వహించిన డిమాండ్స్‌డే ర్యాలీలో పి.అమూల్య, రుక్మిణి, దైవకృప, సత్యవాణి, విజయప్రవీణ, సత్యవతి, దుర్గాదేవి, ధనలక్ష్మి, సంగీత, ఈశ్వరి, ఝాన్సీ, లక్ష్మి, లోవలక్ష్మి పాల్గొన్నారు.


అమలాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, ఆశాలు

రాయవరం: తహశీల్దారు కార్యాలయంఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలోఅంగన్‌వాడీ, ఆశా,మధ్యాహ్నభోజన, భవన నిర్మాణ కార్మికులు నిరసన చేపట్టారు. తహశీల్దారు కృష్ణారావుకు వినతిపత్రం సమర్పించారు సీపీఎం పార్టీ నాయకుడు కె.సత్యనారాయణరెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ నేతలు కృష్ణకుమారి, సత్యవేణి, కమల, నూకరత్నం, ఆశావర్కర్ల యూనియన్ నాయకులు జి.దుర్గ, బేబి, మధ్యాహ్నభోజన వర్కర్ల సంఘ నేతలు త్రివేణి, రాణి, భవన నిర్మాణ కార్మిక నేతలు కె.తాతారావు, బి.దుర్గా ప్రసాద్, గండి శేఖర్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న, డ్వాక్రా, మెప్మా, కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడని పక్షంలో ఐక్య పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జి.శ్రీనునాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో జి.బేబి, నిమ్మకాయల వెంకటేష్, జి.అనంతలక్ష్మి, టి.శ్రీదేవి, ఏవీ రమణమ్మ, సూతాపల్లి అజయ్ కుమార్, గంగాభవానీ, ఇందిర, జట్టు కార్మికులు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆశావర్కర్లు, మధ్యాహ్నం భోజన పథకం వర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు పాతబస్టాండు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీచేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నూకల బలరాం, మండల కన్వీనర్ ఎం.దుర్గమ్మ, అంగన్‌వాడీ నాయకులు సూర్యకుమారి, జహీరా, దుర్గ, విజయలక్ష్మి, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు దేవి, హేమ, ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులు సత్తిబాబు, రమేష్, దొరబాబు పాల్గొన్నారు.

అంబాజీపేట: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనపథక నిర్వహకులు, డ్వాక్రాయానిమేటర్లు నిరసన చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు విమలకుమారికి అందించారు. కారెం వెంకటేశ్వరరావు, బి.ఎస్తేరురాణి, డి.లలితకుమారి, ఆర్.దుర్గామహేశ్వరి, పాపయమ్మ, కరుణ పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనపథకం, వెలుగు, ఉపాధిహామీ, మెప్మా సిబ్బంది ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.బేబీ, అనంతలక్ష్మి, వి.మంగాదేవి, ఎం.జానకీదేవి, వీవోలు లక్ష్మి, ఆశాలు అమ్మాజి, రాణి మాట్లాడుతూ వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. వినతిపత్రాన్ని తహసీల్దార్ రాజరాజేశ్వరికి ఇచ్చారు.

పి.గన్నవరం: అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మిడ్‌డేమీల్స్ వర్కర్లు, ధర్నా నిర్వహించారు. డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, మండల అధ్యక్షురాలు కె.నాగలక్ష్మి, ఆశాల యూనియన్ మండల అధ్యక్షురాలు పుష్ప, మిడ్‌డే మీల్స్ యూనియన్ అధ్యక్షురాలు ఖండవల్లి జయలక్ష్మి పాల్గొన్నారు.

మామిడికుదురు: కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుటఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథక కార్మికులు, స్కూలు కంటింజెంట్ వర్కర్లు నిరసన చేపట్టారు. వినతిపత్రాన్ని తహసీల్దార్ మేరీకమ్మకు అందించారు. కార్యక్రమంలో ఎన్.అన్నపూర్ణ, కె.వెంకటలక్ష్మి, డీబీ సరోజినీ, మంగవతి, ఎం.రత్నకుమారి, కె.సావిత్రి, వి.దుర్గాదేవి పాల్గొన్నారు.

అంతర్వేది: సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది సఖినేటిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ సిబ్బంది డిమాండు చేశారు.

రావులపాలెం: సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, కాంట్రాక్టు ఉద్యోగులు రావులపాలెం తహసీల్దారు కార్యాలయం వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు. అధికారులకు వినతిపత్రం అందించారు. బలరామ్, సూర్యకళ, ఇందిర, స్వర్ణలత, ఎలిజబెత్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకులు నిరసన తెలిపారు. డిమాండ్లు పరిష్కరించాలని తహసీల్దారు వెంకట్రామయ్యకు వినతిపత్రం ఇచ్చారు.

మొహర్రం సందర్భంగా మజ్లిస్‌లు

మామిడికుదురు, జూలై 10: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా మంగళవారం రాత్రి నగరం, మామిడికుదురులోని పలు పంజాల్లో మజ్లిస్‌లు జరిగాయి. నగరంలోని షహజాదేఖాశిం పంజాలో మజ్లిస్ నిర్వహించి అనంతరం నాల్ ముబారక్ పీర్లను ఊరేగించారు. బడేబీబీ పంజా, మంజిలే కర్బలా, సర్కిల్ బాషి స్వగృహంలో జరిగిన ప్రార్థనల్లో మత ప్రబోధకుడు మహ్మద్ఆలీజాఫరీ పాల్గొని మజ్లిస్‌లు ఆలపించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లింలు మజ్లిస్‌లలో పాల్గొని ఇమామ్ హుస్సేన్, అతని పరివారానికి ఘన నివాళులర్పించారు.

గౌరీపట్నానికి బైక్ ర్యాలీ

ఆలమూరు, జూలై 10: సీఎంగా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేగా బండారు సత్యానందరావు ప్రమాణస్వీకారం చేసిన అనంతరం గౌరీపట్నం వస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీడీపీ నాయకుడు కొమ్ము నారాయుడు మొక్కుకున్నారు. బుధవారం టీడీపీ నాయకులు, యువకులు జొన్నాడ నుంచి గౌరీపట్నం ఆయన ఆధ్వర్యంలో మోటారు సైకిళ్లపై గౌరీపట్నం వెళ్లారు. ఈర్యాలీని ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు.టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' ర్యాలీ

అమలాపురం టౌన్, జూలై 10: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలంటూ జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమంలో డీఈవో కమలకుమారి పాల్గొన్నారు. పట్టణంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం చేపట్టిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. బడి మానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకే ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల కోసం స్టూడెంట్ కిట్లు, మధ్యాహ్న భోజన పథకం, తల్లికి వందనం వంటి పలు కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని వివరిస్తూ ప్లకార్డులు చేబూని ర్యాలీ నిర్వహించారు.

డ్రెయిన్లలో వలకట్లు తొలగించకపోతే పంట విరామం

● అల్లవరంలో రైతు సమావేశంలో హెచ్చరిక
● రెల్లుగడ్డ, అల్లవరం గ్రామాల్లో పంట విరామం

అల్లవరం, జూలై10: ఆక్వాచెరువుల్లోని సజ్జును డ్రెయిన్లలోకి తోడేస్తున్నారని, డ్రెయిన్లలో చేపల వలకట్లు తొలగించకపోతే పంట విరామం ప్రకటిస్తామని రైతు నాయకులు హెచ్చరించారు. అల్లవరంలో రైతు నాయకుడు బొక్కా శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెల్లుగడ్డ, అల్లవరం రైతులు బుధవారం సమావేశమై సాగునీటి సమస్య కారణంగా పంట విరామాన్ని ప్రకటించారు. ఆక్వా వ్యర్థాలను మురుగునీరు దిగే రెవెన్యూ, మేజర్ మురుగు కాలువల్లోకి ఇంజన్లతో తోడేస్తున్నారన్నారు. దీంతో మేట వేసి మూసుకుపోయి పల్లపు ప్రాంతాల వరి పొలాల్లో ముంపు దిగడంలేదని ఆరోపించారు. రైతులు 35 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా లోయర్ కౌశిక, పంచనది తదితర డ్రెయిన్లలో వలకట్ల బెడద తప్పడంలేదన్నారు. సామంతకుర్రు, ఎస్.పల్లిపాలెం, కొమరగిరిపట్నం తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లలో అనధికార బరకాల వలకట్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని డిమాండుచేశారు. పంట పొలాలు ఉప్పునీటిమయమై నష్టాలు వస్తున్నందునే పంట విరామం తప్పట్లేదన్నారు. డ్రెయిన్లలో వలకట్లు తొలగించాలని, ఆక్వా చెరువుల సజ్జును డ్రెయిన్లలోకి తోడవద్దంటూ రైతులు నినాదాలు చేశారు. బొంతు జగపతి, పి.సత్యనారాయణ, ఈటి గోవిందరావు, బీవీవీ సత్యనారాయణ, కొంబత్తుల ఆంజనేయులు, బొంతు మోహన్‌దాస్, బొమ్మి చంద్రరావు, గవర వీర్రాజు, కాండ్రేగుల సాయిబాబు, పి.ఏడుకొండలు పాల్గొన్నారు.


అల్లవరంలో పంటవిరామం ప్రకటిస్తున్న రైతు నాయకులు

నేలకొరిగిన భారీ వృక్షం

అంబాజీపేట, జూలై 10: మాచవరం సెంటర్లో ప్రధాన రహదారిపై భారీ వృక్షం నెలకొరిగింది. దీంతో విద్యుత్ స్తంభం, తీగలు ధ్వంసమయ్యాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖాధికారులు మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. అధికారులు భారీ వృక్షాన్ని తొలగించారు.

7కిలోల కణితి తొలగింపు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 10: రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు బుధవారం ఉట్రుమిలికి చెందిన మహిళ గర్భసంచి సమీపంలో ఉన్న 7కిలోల కణితిని శస్త్ర చికిత్స చేసి తొలగించారు. ఏడాదిగా కడుపు నొప్పితో బాధపడుతున్న ఆమెకు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ వీరభద్రుడు, డాక్టర్ సత్యవేణి శస్త్ర చికిత్స జరిపి కణితి తొలగించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు డాక్టర్ ప్రవీణ్ తెలిపారు.

ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలి

అమలాపురం రూరల్, జూలై 10: నామినేటెడ్ పదవులతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో మండల పరిధిలోని సభ్యులంతా ఏకాభిప్రాయంతో ముందుకుసాగేందుకు జనసేన సమావేశం తీర్మానించింది.పార్టీ అమలాపురం మండల శాఖ సమావేశం లింగోలు పండు అధ్యక్షతన బుధవారం జరిగింది. 22గ్రామాలనుంచి జనసైనికులు, నాయకులు, వీరమహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సార్వత్రికఎన్నికల్లో జనసేన ఘన విజయంపైహర్షం వ్యక్తంచేశారు. పార్టీబలోపేతం, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. అమలాపురంఅసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిని త్వరలో నియమించేందుకు పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లేందుకు నిర్ణయించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

రాయవరం, జూలై 10: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ నిరంతరం కృషి చేస్తోందని ఎస్టీయూ కోనసీమ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అన్నారు. బుధవారం మండలంలోఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు ఉదయం 9నుంచి 5వరకు మండలంలోని 12గ్రామాల్లో సభ్యత్వనమోదు చేపట్టారు. ఎస్టీయూ మండలాధ్యక్షుడు దేవరకొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పంపన వీర వెంకటరమణ, రాయవరపు భాస్కరరావు, అభయ్ పాల్గొన్నారు.

బియ్యం పంపిణీలో జాప్యం చేస్తే చర్యలు

మండపేట, జూలై10: రేషన్ సరుకులు పంపిణీలో జాప్యంచేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సురేష్‌కుమార్ నిర్వాహకులను హెచ్చరించారు. బుధవారం మండపేట, తాపేశ్వరం, ఏడిద తదితర ప్రాంతాల్లో ఎండీయూ వాహనాల ద్వారా జరుగుతున్న రేషన్ పంపిణీని పరిశీలించారు.

రైతుల శ్రమదానం

ఆత్రేయపురం, జూలై 10: వర్షాలకు వరి పొలాలు నీట మునిగాయి. అంకంపాలెంలోని దేవరకొండ డ్రెయిన్ గుర్రపుడెక్కతో మూసుకుపోయింది. తెలుగు రైతు మండల శాఖ అధ్యక్షుడు కరుటూరి వరప్రసాద్ ఆధ్వర్యంలో రైతులు శ్రమదానంతో కిలోమీటరు తూడు, గుర్రపుడెక్క తొలగించారు.

మట్టి నమూనాల సేకరణతో ప్రయోజనాలు

రావులపాలెం, జూలై 10: రావులపాలెం మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద బుధవారం మట్టి నమూనాల సేకరణ, వాటి ఉపయోగాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆత్మ పీడీ జ్యోతిర్మయి మాట్లాడుతూ రైతులకు పోషక యజమాన్యంపై అవగాహన కలిగే విధంగా క్షేత్ర స్థాయిలో సదస్సులు నిర్వహించాలన్నారు. మట్టి నమునాల సేకరణ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సదస్సులో వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎ.రాజశేఖర్, జిల్లా అధికారి కె.శ్రీనివాస్, మనోహర్, ఆకుల వీరబాబు, వరలక్ష్మి, భవాని, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కె.గంగవరం, జూలై 10: కోటిపల్లిలో గ్రామానికి చెందిన అంగాడి సత్తిబాబు(36) అనుమానాస్పద స్థితిలోవ్యక్తి మృతిచెందాడని ఎస్ఐ కె.జానీ తెలిపారు. అతడితో భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. బుధవారం సత్తిబాబు ఇంటి వద్ద మృతిచెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసుల ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

మంచినీటి కోసం గ్రామసభలో నిరసన

మలికిపురం, జూలై 10: రామరాజులంక బాడవ, ఊసకాల్వగట్టు, చర్చిపేటలకు నెల రోజుల నుంచి తాగునీరు అందడం లేదని బుధవారం జరిగిన గ్రామసభలో సర్పంచ్, కార్యదర్శులను మహిళలు నిలదీశారు. తాగునీరు సరఫరా చేయడానికి ఏమిటి ఇబ్బందని అడిగారు. పంచాయతీ నుంచి నిధులు ఖర్చుచేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు డిమాండ్ చేశారు. గ్రామ సభలో సర్పంచ్ కాకర శ్రీనివాస్, కార్యదర్శి బొంతు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆడిట్ అధికారిగా సత్యనారాయణ

ముమ్మిడివరం, జూలై 10: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆడిట్ అధికారిగా ఎ.వీరవెంకట సత్యనారాయణ బుధవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సత్యనారాయణ గతంలో జిల్లా స్పెషల్ సెల్ ఆడిటర్‌గా పనిచేశారు. ఎన్నికల సాధారణ ఎన్నికల బదీల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాకు వెళ్లగా తిరిగి కోనసీమకు వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలి

అయినవిల్లి, జూలై 10: అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రసంగించారు. ధాన్యం సొమ్ములు రైతుల ఖాతాల్లో జమకాకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. నేదునూరు ఎంపీటీసీ కళ్లేపల్లి సుబ్బరాజు, సలాది బుచ్చిరాజు, మాగాం సర్పంచ్ కాశి వీరవెంకటసత్యనారాయణ విద్యుత్ సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి, జేఎస్ఎస్ దీక్షితులు, కాకర శ్రీనివాస్, బొబ్బా ప్రభాత్‌కుమార్‌పాల్గొన్నారు.

నూతన అన్నదాన, శివాలయ ప్రదేశాలు పరిశీలన

అంతర్వేది, జూలై 10: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా అదనపు నూతన అన్నదాన భవన నిర్మాణం, సముద్ర తీరాన భక్తుల సౌకర్యార్థం దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేపట్టే ప్రదేశాలను దేవదాయ, ధర్మాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారి టి.దుర్గేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శ్రీనివాస్, డిప్యూటీ స్థపతి జి.శ్రీనివాసాచార్యులు బుధవారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేయడానికి పలు సూచనలు చేశారు. పుణ్యక్షేత్ర, ఆలయాల అభివృద్ధిపై ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆలయసహాయ కమిషనర్ వి.సత్యనారాయణ సమీక్ష నిర్వహించారు. పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు పాల్గొన్నారు.

15నుంచి పాఠశాల వేళల్లో మార్పు

యానాం, జూలై 10:పుదుచ్చేరి, కారైకాల్, మాహే, యానాం రీజియన్లలో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తోన్న నేపథ్యంలో ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల సమాయవేళల్లో మార్పు చేశారు. ఈనెల15నుంచి రోజు ఉదయం 9గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.20గంటలకు తరగతులు ముగుస్తాయన్నారు.

యానాంలో భారీ వర్షం

యానాం, జూలై 10: యానాంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.పరిపాలనాధికారి మునిస్వామి బృందం వర్షంతో మూసుకుపోయిన డ్రైన్లు, ముంపు ప్రాంతాలను పరిశీలించి డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దాలని అధికారులకు సూచించారు.

కలెక్టర్‌కు ధాన్యం కుచ్చు

అమలాపురంటౌన్, జూలై10: చేనేత, బీసీ సంఘ నాయకులు బుధవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలుసుకున్నారు. చేనేతవస్త్రాలు, ధాన్యపు కుచ్చును కలెక్టర్‌కు అందజేసి సత్కరించారు. మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, చింతా అత్తిలింగం, సొసైటీ మాజీ అధ్యక్షుడు పుత్సల వరదరాజులు, మాజీ సర్పంచ్ చొల్లంగి సత్యసాయిబాబాపాల్గొన్నారు.

కోళ్లఫారం నిర్మాణం ఆపాలని ఫిర్యాదు

మండపేట,జూలై10: ద్వారపూడిపంచాయతీ పరిధి కెనాల్‌రోడ్డులో అనుమతులులేకుండా చేపడుతున్న కోళ్లఫారం నిర్మాణ పనులను ఆపాలని గ్రామస్తులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. కోళ్లఫారంతో రోగాలు బారిన పడతామ న్నారు. పంచాయతీ కార్యదర్శి ఏవీవీ రమణ నిర్వాహకు లకు నోటీసులు జారీచేశారు. నోటీసు అందుకోకపోవడంతో కోళ్ల ఫారం వద్ద పిల్లర్‌కు నోటీసు అంటించినట్లు కార్యదర్శి తెలిపారు. నిర్మాణ పనులు నిలుపుదల చేయకపోతే ఆందోళన చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

మొగ తవ్వితే ఉప్పునీటి కయ్యలుగా మారతాయి

తవ్వకాలు ఆపాలంటూ తహసీల్దార్‌కు రైతుల వినతి

ఉప్పలగుప్తం, జూలై 10: కూనవరం మేజర్ డ్రెయిన్ శివారు సముద్ర మొగ తవ్వకానికి జరుగుతున్న ప్రయత్నాలను తక్షణం అడ్డుకోవాలని డ్రెయిన్ ఆయకట్టు రైతులు బుధవారం తహసీల్దారు మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. మొగ తవ్వితే తమపంట పొలాలు ఉప్పునీటి కయ్యలుగా మారిపోతాయని, కొబ్బరిచెట్లు ధ్వంసమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. 1992లో మొగ తవ్వినప్పుడు పొలాల్లో ఉప్పునీరు ప్రవహించి ఎలా మాడిపోయాయో వివరించారు. ఇప్పుడు కూడా మత్స్యకారులు మొగ తవ్వకానికి రంగం సిద్ధం చేశారన్నారు. వారి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. తొలుత చీకట్లపాలెంలో పోలిశెట్టి భాస్కరరావు ఇంటి వద్ద ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాలకు చెందిన కూనవరం ఆయకట్టు రైతులు సమావేశమయ్యారు. మొగ తవ్వకానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. రైతు నాయకులు పోలిశెట్టి భాస్కరరావు, కుచ్చర్లపాటి పెద్దిరాజు, నల్లా బాబండి, అరిగెల నానాజీ, చిక్కం పెద్దబ్బులు, ఈదరపల్లి శ్రీనివాసరాజు, రుద్రరాజు సత్యనారాయణరాజు, చిక్కం కాసు, అడబాల సత్యనారాయణ, నడింపల్లి సూర్యనారాయణరాజు, గారపాటి రాజారావు, చిక్కం కొండ పాల్గొన్నారు.


తవ్వకాలు ఆపాలని తహసీల్దార్‌కు రైతుల వినతి

ఆర్యేపురం సినిమా పోస్టర్ విడుదల

అంతర్వేది,జూలై10: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలోమలికిపురానికి చెందిన గుబ్బల రవికిరణ్ హీరోగా, నిర్మాతగా రూపొందించిన ఆర్యేపురం సినిమా పోస్టర్‌ను ఎమ్మెల్యే దేవవరప్రసాద్ ఆవిష్కరించారు. మట్టా శ్రీకర్‌ప్రసాద్ దర్శకత్వంలో యువత మత్తుపదార్థాలకు బానిసలవ్వకూడదని చిత్రాన్ని నిర్మించామన్నారు.